సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 7 । జనవరి । 2024



శ్రీవారి తిరువీధి సేవ

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీవారి తిరువీధి సేవ నేత్రపర్వంగా సాగుతోంది. భక్తులు నీరాజనాలు అర్పిస్తున్నారు.



భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు రద్దీ సాధారణంగా ఉంది. సంక్రాంతి ముందు రోజులు కావడంతో భక్తులు స్వల్ప సంఖ్యలో విచ్చేశారు.



హుండీ ఆదాయం లెక్కింపు

ఆకివీడు: స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.1.52,926 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ రంగరాజు తెలిపారు.

పేదలకు పెన్షన్ భరోసా

కొత్తగా మురిపింఛెన్

- జిల్లాలో 4,274 మందికి కొత్త పెన్షన్లు
- అర్హతే ప్రామాణికంగా మంజూరు
- నాలుగున్నరేళ్లలో 87,572 మందికి అదనంగా లబ్ధి
- నెలకు రూ.69.55 కోట్ల అందజేత



యలమంచిలి మండలం మేడపాడులో లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి (ఫైల్)

సాక్షి, భీమవరం: ఎక్కడికి తిరగాల్సిన పనిలేదు.. ఎవరి సిఫార్సులు అవసరం లేదు.. అర్హత ఉంటే చాలు.. వలంటీరే వివరాలు తీసుకుని సచివాలయంలో దరఖాస్తు చేయిస్తారు.. ఆరు నెలల్లోపు పింఛన్ సొమ్ములు ఇంటికి వచ్చి చేతికందిస్తారు.. ఇది రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సామాజిక పింఛన్ల పరిస్థితి. పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా సామాజిక పింఛన్ల పంపిణీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సంస్కరణలు తీసుకువచ్చారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా అర్హత కలిగిన వారందరికీ పారదర్శకంగా కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ వస్తున్నారు.

2.36 లక్షల మంది లబ్ధిదారులు

2021 సెప్టెంబర్ వరకు ఎప్పటికప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేయగా సాంకేతిక ఇబ్బందుల దృష్ట్యా 2022 జనవరి నుంచి ప్రతి ఆరు నెలలకు కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 2019 నాటికి జిల్లాలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి, దివ్యాంగ, చేనేత, కల్లుగీత తదితర సామాజిక పింఛన్ల లబ్ధిదారులు 1,49,356 మంది ఉండగా నెలకు వారికి అందించే సాయం రూ.33 కోట్లు ఉండేది. గత నాలుగున్నరేళ్లలో జిల్లాలో 87,572 కొత్త పింఛన్లు మంజూరు చేయగా ప్రస్తుతం లబ్ధిదారుల సంఖ్య 2,36,928 మందికి చేరింది. రూ.3 వేల పెన్షన్ సాయంతో వీరికి ప్రభుత్వం రూ.69.55 కోట్లు అందిస్తోంది.

గణనీయంగా లబ్ధిదారులు

గత టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే పింఛన్ లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు వారికందించే సాయం రెండింతలకు పైగా కావడం పేదలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోంది. గత టీడీపీ హయాంలో పింఛన్ రావాలంటే జన్మభూమి కమిటీని ప్రసన్నం చేసుకోవాలని, చోటామోటా నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని వృద్ధులు గుర్తు చేసుకుంటున్నారు.

జిల్లాలో కొత్త పింఛన్ల మంజూరు

2021 సెప్టెంబర్‌లోపు	48,114
2022 జనవరి	9,117
2022 జూలై	5,070
2023 జనవరి	10,397
2023 సెప్టెంబర్	10,600
2024 జనవరి	4,274

భరోసా కలిగింది



నా భర్త చనిపోయి మూడు నెలలు కావస్తుంది. నాకు ఇద్దరు అమ్మాయిలు. చిన్న అమ్మాయి జగనన్న కల్పించిన వలంటీర్ ఉద్యోగం చేస్తుంది. పెద్ద అమ్మాయి ఇంటి వద్దే ఉంటుంది. అమ్మాయి పోషణే మాకు ఆధారం. ఇప్పుడు పింఛన్ మంజూరు కావడం మాకు భరోసానిస్తోంది.

– దుండి విమలకుమారి, పాలకొల్లు

పైరవీలు లేకుండా..



ఎటువంటి పైరవీలు, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పని లేకుండా పింఛన్ సాయం అందుకున్నాను. వలంటీర్ ద్వారా దరఖాస్తు చేయగానే మంజూరు చేశారు. రెండు రోజుల క్రితం వలంటీర్ ఇంటికి వచ్చి సాయం అందించారు. సీఎం జగన్ మేలును మరువలేను.

– కడలి లక్ష్మి, సిద్ధాంతం, పెనుగొండ మండలం

జగన్ వచ్చాకే పింఛన్



ఆధారం ఏమీ లేక ఇళ్ల వద్ద పని చేసుకుంటూ జీవిస్తున్నాను. నాకు 50 ఏళ్లు నిండటంతో రెండు నెలల క్రితం వలంటీర్ వచ్చి ఒంటరి మహిళ పెన్షన్ రాయించారు. ఈనెల 1వ తేదీన రూ.3 వేలు చేతికందించారు. ఇప్పుడు పింఛన్ ఉందన్న ధైర్యం వచ్చింది. సీఎం జగన్ మేలును ఎప్పటికీ మరువలేను.

– దార్ల సత్యజ్యోతి, లిఖితపూడి, నరసాపురం మండలం

దరఖాస్తు చేసిన వెంటనే..



నా భర్త కాలం చేయడంతో వితంతు పింఛన్ కోసం ఇటీవల వలంటీర్ దరఖాస్తు చేయించారు. వెంటనే కొత్త పింఛన్ మంజూరు చేసి ఈనెలలోనే రూ.3 వేలు ప్రభుత్వ సాయం అందించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో నా కుమార్తె చదువుకుంటోంది.

– బెజ్జవరపు నాగలక్ష్మి, తణుకు

కొండంత ధైర్యం



నా కుమార్తెకు వివాహమై అత్తింటికి వెళ్లిపోగా కుమారుడు కూలిపని చేసుకుంటున్నాడు. పేద కుటుంబానికి చెందిన నాకు పింఛన్ మంజూరు కావడం కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. వలంటీర్ వచ్చి చేతికి రూ.3 వేలు ప్రభుత్వ సాయం అందించారు. జగన్ బాబు మాకు భరోసా కల్పించారు.

– నక్కా మంగమ్మ, ఆకివీడు

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం (ప్రకాశంచౌక్): రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఇబ్బందులను అధిగమించేందుకు ప్రతికూల పరిస్థితులను, ప్రాంతాలను ముందుగా గుర్తించి నివేదిక రూపొందించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆర్డీఓలు, పోలీసు అధికారులతో ఆమె జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలు, పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఎన్నికలను నిర్భయంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 2014, 2019 ఎన్నికలనాటి పరిస్థితులను బేరీజు వేసుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో వివిధ కులాలు, రాజకీయ పార్టీల మధ్య తగాదాలు, ప్రాంతాలను గుర్తించడంతో పాటు రౌడీషీట్ కేసులు తదితర పోలీస్ రికార్డుల్లో ఉన్న కేసులను బైండోవర్ చేయాలన్నారు.

యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల మార్గదర్శకాలు అనుసరించి బైండోవర్ డాక్యుమెంట్లను పకడ్బందీగా సిద్ధం చేసి పొందుపరచాలన్నారు. జిల్లాలోని చెక్‌పోస్టుల్లో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేయాలని, మరిన్ని చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాలన్నారు. ఎన్నికల సమయంలో మద్యం పంపిణీ జరగకుండా ఎక్సైజ్ శాఖ పటిష్ట కార్యాచరణ రూపొందించాలన్నారు. ఆర్డీఓలు, డీఎస్పీలు అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, సెబ్ ఏఎస్పీ ఏటీవీ రవికుమార్, డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, ఆర్డీఓలు కె.శ్రీనివాసులురాజు, కె.చెన్నయ్య, ఎం.అచ్యుత అంబరీష్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, డీఎస్పీలు బి.శ్రీనాథ్, సి.శరత్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

త్వరితగతిన పరిష్కరించాలి



సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కాళ్ల: ఓటరు నమోదు, తొలగింపు, జాబితాల్లో మార్పులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బొండాడలో శుక్రవారం ఆమె పర్యటించి ఫొటోస్ సిమిలర్ ఎంట్రీస్, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్ తొలగింపుల ప్రక్రియను శనివారం ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతనెల 9 నుంచి అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఓటరు నమోదు అధికారులు నియోజకవర్గం, మండల కేంద్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులపై నివేదిక సమర్పించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై పోలింగ్ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్ టీపీ కృష్ణారావు, ఆర్ఐ, బీఎల్ఓలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక



నందిని

ఏలూరు రూరల్: ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాల క్రీడాకారిణి పి.నందిని జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యిందని హెచ్ఎం జి.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి 12 వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్–14 బాస్కెట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు. గత నవంబరులో చిత్తూరు జిల్లాలో జరిగిన అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో నందిని ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యిందన్నారు. 8వ తరగతి చదువుతున్న నందిని మూడుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని గుర్తింపు తెచ్చుకుందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.మురళీకృష్ణ, ఎంపీఎల్ ప్రసన్న ఆమెను అభినందించారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి సొంత గ్రామాలకు వచ్చే వారి కోసం ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి ఈనెల 10 నుంచి 13 వరకు 90 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు ఏలూరు జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభమైందని, అలాగే ఈనెల 16 నుంచి 21 వరకు ఆయా డిపోల నుంచి ఇప్పటివరకు దాదాపు 50 సర్వీసులకి రిజర్వేషన్ సౌ కర్యం ప్రారంభించామని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖతో పాటు విజయవాడకు ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. సంక్రాంతి కానుకగా సాధారణ చార్జీలకే ప్రయాణికులకు టికెట్లు విక్రయిస్తున్నామని, రానుపోనూ టికెట్లు బుక్ చేసుకుంటే పది శాతం రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

మహిళాభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యం

నూజివీడు: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు సీఎం జగన్ తోడ్పాటు అందిస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలో డ్వాక్రా మహిళలు రూ.36 లక్షలతో ఏర్పాటు చేసిన నూజివీడు చేయూత మహిళా మార్ట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ మహిళా మార్ట్‌లో నాణ్యమైన సరుకులను తక్కువ ధరకు విక్రయిస్తున్నందున మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో మహిళాభివృద్ధికి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మహిళలంతా సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలన్నదే సీఎం జగన్ ధ్యేయమన్నారు. సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ మహిత మాట్లాడుతూ రాష్ట్రంలో 45 మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేశామని, నూజివీడు మార్ట్ 46వదని అన్నారు. మొత్తంగా రూ.70 కోట్ల వ్యాపారం నిర్వహించామన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్



భట్లమగుటూరు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుగొండ: నవరత్నాలు అమలుతో రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సీఎం జగన్ నెరవేర్చారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం పెనుమంట్ర మండలం భట్లమగుటూరుకు చెందిన లబ్ధిదారులకు తూర్పుపాలెంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. లబ్ధిదారులకు ఇంటి రుణాలు సైతం అందించి వారి సొంతింటి కలను నెరవేర్చారన్నారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి పాలకులు పేదవాడి సొంతింటి కలను నీరుగార్చారన్నారు. రాష్ట్రంలో కనీసం సెంటు భూమిని సేకరించలేదని విమర్శించారు. సీఎం జగన్ పాలనలో ఇళ్ల పట్టాల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. పారదర్శకంగా ఇళ్ల పట్టాలను అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. వైస్ ఎంపీపీ ఈది అనిత, ఈది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిల నియామకం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని కోర్టుల్లో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలకొల్లు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా వీఎస్ఎన్ లక్ష్మి, ఏలూరు రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి (జువైనల్ కోర్టు)గా బండి రచన, ఇప్పటి వరకూ ఏలూరు జువైనల్ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న ఎస్.వాసుదేవ్‌ను ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, ఏలూరు, కావలిలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న రొక్కం వరలక్ష్మిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నరసాపురం, 3వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అనకాపల్లిలో పనిచేస్తున్న ఎం.శివకిరణ్‌ను కైకలూరు జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు.

కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: గ్రామాల్లో శాశ్వతమైన అభివృద్ధి పనులకు ప్రభుత్వం కోట్లాది రూపాయాలు వెచ్చిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఉనికిలిలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌లను నిర్మించి, ప్రజలకు, రైతులకు సత్వర సేవలు అందిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆయా కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ పాలనలో తీసుకువచ్చారన్నారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ వట్టికూటి అనంతలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ముదునూరి దుర్గాభవానీ, సొసైటీ అధ్యక్షుడు వట్టికూటి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌లు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్‌రూమ్‌లను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలో ఐదు చోట్ల స్ట్రాంగ్‌రూమ్‌లు సిద్ధం చేయడంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ భద్రపరిచేందుకు నెలాఖరులోపు ఐదు స్ట్రాంగ్‌రూమ్‌లు సిద్ధం చేయాలన్నారు. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, పెనుగొండ మండలాల ట్రెజరీ కార్యాలయంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న సామగ్రిని వేరోచోట భద్రపరిచి సిద్ధం చేయాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న మెటీరియల్ శాఖల వారీగా కోర్టులు 28, పంచాయతీరాజ్ శాఖ 32, రెవెన్యూ శాఖ 5, జైలు శాఖ 2, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ 1, మున్సిపల్ శాఖ 1 మొత్తం 68 ఆర్టికల్స్ ఉన్నాయన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించి చిన్నపాటి మరమ్మతులు ఉంటే సరిచేసుకోవాలన్నారు. జిల్లా ఏఎస్పీ వి.భీమారావు, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా ట్రెజరీ అధికారి ఆదారి గణేష్, జిల్లా రిజిస్ట్రార్ అధికారి ఆర్.సత్యనారాయణ, డీఈఓ ఆర్.వెంకటరమణ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



ముస్లిం యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: తెలుగుదేశం పార్టీ అనుసరిస్తున్న విధానాలు నచ్చక.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులవుతూ ముస్లిం యువకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. కైకలూరు మార్కెట్ యార్డ్‌లో జరిగిన ఏఎంసీ చైర్మన్ వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆసాని ఖాన్, సలీం, బాజీ, హబీబ్ బాషా, ఆరిఫ్, జబ్బర్, గౌస్, హనీఫ్, నయీమ్, నవ్యాత్, రెహమాన్ వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ వారికి పార్టీ కండవాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ అబ్దుల్ హమీద్, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, జిల్లా ముస్లిం మైనార్టీ విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ, జాయింట్ సెక్రటరీ షేకా మూసా, నాయకులు ఎస్‌డీ.బాషా, ఫిర్దోస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

12 వరకు అభ్యంతరాల స్వీకరణ

భీమవరం (ప్రకాశంచౌక్): భారత ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితా విడుదల గడువు పొడిగించినందున ఈనెల 12 వరకు ఓటర్ల నమోదు క్లయిమ్‌లు, అభ్యంతరాలకు సంబంధించి ఆర్జీలు స్వీకరిస్తామని డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. క్లయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, పీఎస్ఈఎస్, డీఎస్ఈఎస్‌ల పరిష్కారం, జెండర్ రేషియో, దివ్యాంగుల ఓటర్ల నమోదు, చేర్పులు, తొలగింపులు, కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడం వంటి అంశాలపై సమీక్షించారు. ఎన్నికల తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సాంబమూర్తి ఆశయాల్ని కొనసాగించాలి

భీమవరం అర్బన్: భూపోరాట యోధుడు నాగిడి సాంబమూర్తి (గెద్దం సాంబమూర్తి) తుది శ్వాస వరకు కమ్యూనిస్టుగానే జీవించారని.. కాళీపట్నం జమీందార్ భూములు, సీఏడీ భూముల పంపిణీ, డీ ఫారెస్ట్ భూ పోరాటాల్లో ఆరితేరిన కమ్యూనిస్ట్ యోధుడని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరం మండలంలోని నాగిడిపాలెంలో శనివారం నాగిడి సాంబమూర్తి కాంస్య విగ్రహాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణతో కలిసి శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పేదలకు భూమి, భుక్తి కోసం పాలిత, పీడిత ప్రజల అభ్యున్నతి కోసం జీవితాన్నే త్యాగం చేసిన సాంబమూర్తి ఆదర్శనీయులన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ గెద్దం సాంబమూర్తి పోరాటం స్ఫూర్తిదాయకమని.. చాలా కాలం ఆయనతో కలిసి పనిచేశానన్నారు. గౌరవం అనేది ఆయన వద్ద నుంచే నేర్చుకున్నానని గొప్ప వ్యక్తిత్వమని కొనియాడారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ సాంబమూర్తి ఒక యోధుడని తమకు ఆత్మ బంధువని తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే వంక సత్యనారాయణ జరిపిన అన్ని ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఐ నాయకులు నెక్కంటి సుబ్బారావు, డీవీఎస్ వర్మ, లంకా కృష్ణమూర్తి, చంద్రానాయక్, జేఎన్వీ గోపాలన్, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



నాగిడిపాలెంలో సాంబమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

మతం, రాజకీయం వేర్వేరు

రాజకీయాలు, మతాలు వేర్వేరని, బీజేపీ ప్రభుత్వం రాజకీయాలను మతాలకు ముడిపెట్టడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతూ అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ వేదికగా చేస్తుందన్నారు.

వై నాట్ షోరూం ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : వినియోగదారులకు అందుబాటు ధరల్లో ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు అందిస్తూ వై నాట్ ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయన్సెస్ వినియోగదారుల మన్ననలు పొందుతుందని వైనాట్ ఎలక్ట్రానిక్స్, వైనాట్-హావెల్స్ ఇండియా లిమిటెడ్, లాయడ్ స్టేట్ హెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.హేమసుందర్ తెలిపారు. శనివారం అల్లవరం వద్ద కోడూరుపాడులో వైనాట్ ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయన్సెస్ షోరూంను హేమసుందర్ ప్రారంభించారు. సేల్స్ విభాగాన్ని ఐఎఫ్‌బీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ హోమ్ అప్లయన్సెస్ విభాగం బిజినెస్ హెడ్ డీకే అరుణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమసుందర్ మాట్లాడుతూ ఉభయ గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో 29 షోరూంలు ఏర్పాటుచేసి అన్ని గృహోపకరణాలు ఒకేచోట తక్కువ ధరలకు అందిస్తున్నామన్నారు. షోరూం అధినేత జుజ్జవరపు రాయుడు మాట్లాడుతూ పలు కంపెనీల ఉత్పత్తులు సామాన్యులకు అందుబాటు ధరలలో ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే లక్కీ డ్రాలో రిఫ్రిజిరేటర్ బహుమతిగా అందిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో హయర్ బ్రాంచ్ మేనేజర్ సుధీర్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



అల్లవరంలో వై నాట్ షోరూం ప్రారంభిస్తున్న హేమ సుందర్

అంగన్‌వాడీలు విధుల్లో చేరాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్, మినీ అంగన్‌వాడీ వర్కర్లు ఈ నెల 8న తమ విధులకు తప్పనిసరిగా హాజరుకావాలని పశ్చిమ గోదావరి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి బి.సుజాతా రాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన గడువులోగా విధులకు హాజరు కాని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్, మినీ అంగన్‌వాడీ వర్కర్లు ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని తెలిపారు. ఈ నెల 6న ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం అంగన్‌వాడీలు గడువులోగా విధులకు హాజరు కావాల్సి ఉందన్నారు.

38 కిలోల గంజాయి స్వాధీనం

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లా పెదపాడు మండలం కలపర్రు టోల్‌ప్లాజా వద్ద గంజాయి స్వాధీనం చేసుకుని, రవాణా చేస్తున్న నలుగురిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి 38 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ ఏలూరు సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈబీ టాస్క్‌ఫోర్స్ సీఐ ధనరాజ్ తెలిపారు. విశాఖపట్నం నుంచి మధ్యప్రదేశ్‌కు గంజాయిని రవాణా చేస్తుండగా ఎస్ఈబీ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు కలపర్రు టోల్‌ప్లాజా వద్ద గంజాయిని సీజ్ చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు.



గంజాయి స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ అధికారులు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం-నవాబుపాలెం రైల్వేస్టేషన్ల మధ్యలో శనివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో నవాబుపాలెం స్టేషన్ దగ్గరలో గుర్తు తెలియని రైలు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందారని తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. మృతుడి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగుపై నలుపు రంగు పువ్వుల షర్టు, తెలుపు రంగు బనియన్ ధరించినట్లు చెప్పారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 94906 17090 నెంబరులో సంప్రదించాలన్నారు.



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

విద్యకు ప్రభుత్వ సాయం భేష్

ఉండి : నిరుపేదల విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం చాలా గొప్పదని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. శనివారం మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మాల మహానాడు ముఖ్యనాయకులతో మండలాధ్యక్షుడు తొర్లపాటి భాగ్యరాజు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ముందడుగు వేయాలంటే చదువు ఒక్కటే ఆయుధమని అన్నారు. నిరుపేదలు చదువులో వెనుకబడకుండా కార్పొరేట్‌కు దీటుగా ఇంగ్లీషు మీడియం చదువులు ప్రవేశపెట్టారని అన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన అంటూ ఎన్నో రకాల ప్రోత్సహకాలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ విద్యపై సహకారాన్ని వినియోగించుకుని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చిగురుపాటి రాజేష్, రాజ్‌కుమార్, నాయకులు సాయి జగన్, పిట్టా వినోద్ కుమార్, గొర్ల గోపీ, నేతల సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం: యువకుడి మృతి ఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపారు. స్థానిక ముత్యాలమ్మ నగర్‌లో నివాసం ఉంటున్న కొండేపూడి మహేంద్రబాబు(25) కూలీపని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 6 ఉదయం కూలికి వెళ్లిన మహేంద్రబాబు పారిజాతగిరి కొండ దిగువన ఉన్న ఓ రైతు పొలంలోని పాడుబడిన నీటి బావిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలానికి చేరుకున్న ట్రైనీ డీఎస్పీ బి.విద్య, పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మహేంద్రబాబు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడా? లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు. మహేంద్రబాబు తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు పూజలు



విశేష అలంకరణలో వరాల వేంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీవరాల వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. స్వామివారికి వేకువజామునే సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలను జరిపారు. పరిసర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

క్రీడా సామగ్రి బహూకరణ



భవిత సెంటర్‌లో క్రీడా సామగ్రి అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం భవిత సెంటర్‌లోని దివ్యాంగులకు క్రీడా సామగ్రి అందజేశారు. డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య, దాత లంకా శ్రీనివాస్ సౌజన్యంతో దివ్యాంగుల పిల్లలకు గాలిపటాలు, క్రికెట్ కిట్, ఇతర సామగ్రి అందజేశారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జ్యోతి, కుమారి, సభ్యులు యర్రా ఆంజనేయస్వామి, కె.వెంకటేశ్వరరావు, జామి సత్యనారాయణ, ఎం.వెంకటరత్నం, టి.పాండురంగారావు, మధు, సాయి, శృతి పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వృద్ధులు

తాడేపల్లిగూడెం రూరల్: పింఛన్‌దారుల పాలిట దైవం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తాడేపల్లిగూడెం సొసైటీ డైరెక్టర్ నీలపాల రామన్న అన్నారు. శనివారం మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పింఛన్‌దారులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నీలపాల రామన్న మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన టంచన్‌గా పింఛన్ అందించడం జరుగుతుందన్నారు. తద్వారా పింఛన్‌దారుల వ్యక్తిగత అవసరాలకు పింఛన్‌సొమ్ములు ఎంతగానో ఉపకరిస్తున్నాయన్నారు. ముందుగా ఇచ్చిన హామీ మేరకు జనవరి నుంచి రూ.3వేలు పింఛన్‌ను అందిస్తుస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దూలం శ్రీరామ్, సచివాలయ కార్యదర్శి కొత్తపల్లి ప్రసాద్, నాయకులు శీలంశెట్టి బాలాజీ, చామంతి మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

తణుకు: తణుకు పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ తణుకు పీస్ ఆఫ్ యూత్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు అబ్బదాసరి లాజర్ చేతుల మీదుగా డంపింగ్ యార్డులోని వృద్ధులు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు అబ్బదాసరి సులేమాన్, షేక్ సుబాన్, అబ్బదాసరి కల్యాణ్, యార్లగడ్డ దాసు, కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాలినడకన ద్వారకాతిరుమలకు..



తణుకు నుంచి కాలినడకన బయల్దేరిన ఆంధ్రాసుగర్స్ ఉద్యోగులు

తణుకు: తణుకు ఆంధ్రాసుగర్స్ ఉద్యోగులు ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి శనివారం కాలినడకన బయల్దేరి వెళ్లారు. ఈ మేరకు తణుకు నుంచి బయల్దేరిన వీరు ఆదివారం స్వామివారిని దర్శించుకోనున్నారు.

నేడు ప్రజాదీవెన పాదయాత్ర

అత్తిలి: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదివారం ఉదయం ఉరదాళ్లపాలెం, మధ్యాహ్నం పరిఘేడు గ్రామాల్లో ప్రజాదీవెన పాదయాత్రలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. పాదయాత్ర కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీనాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- 5వ రోజుకు కారుమూరి ప్రజాదీవెన పాదయాత్ర



అత్తిలి మండలం ఉనికిలిలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, భవిష్యత్‌లోనూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. అత్తిలి మండలం ఉనికిలి, లక్ష్మీనారాయణపురం గ్రామాలలో శనివారం 5వ రోజు కారుమూరి ప్రజాదీవెన పాదయాత్ర సాగింది. ఈ పాదయాత్రలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకి ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. దారిపొడవునా మహిళలు, వృద్ధులు మంత్రికి హారతులు పట్టారు. ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, లేదా అని ప్రజలను కారుమూరి అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజలతో మమేకం అయ్యేందుకు ప్రజాదీవెన పేరిట పాదయాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజాదీవెన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడంతో సంతోషంగా ఉందన్నారు. గత టీడీపీ పాలనలో ఉనికిలి గ్రామంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కేవలం కోటిన్నర ఖర్చుచేస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇదే గ్రామంలో రూ.19 కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. విద్య, వైద్య, వ్యవసాయంతో పాటు అనేక సంక్షేమ పథకాలతో గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి పనులను చేపడుతూ మంచిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ వట్టికూటి అనంతలక్ష్మి, ఎంపీటీసీ ముదునూరి దుర్గాభవానీ, ఆడారి శ్రీనివాసరావు, ఉనికిలి సొసైటీ అధ్యక్షుడు వట్టికూటి సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు బొడ్డేటి మురళీకృష్ణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, మండల పార్టీ నాయకులు రంభ సూరిబాబు, గారపాటి నాగరాజు, మద్దాల శ్రీనివాస్, ఆకుల పండుస్వామి, కోరుకొల్లు వెంకట్రావు, సబ్బితి రాజేష్, వట్టికూటి రాము, కంకటాల సతీష్, ఆకుల చినబాబు, మండా సత్యనారాయణమూర్తి, కొరిపల్లి ఆనందరావు, దుండి మాణిక్యాలరావు, తోరం సత్యనారాయణ, ఖండవల్లి ఏసయ్య, బొడ్డు వెంకటేశ్వరరావు, బొడ్డేటి శ్రీను, ఎంపీడీవో అమీలుజమా తదితరులు పాల్గొన్నారు.

దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు ఎనలేనివి



లక్ష్మీనారాయణపురంలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: శెట్టిబలిజల అభివృద్ధికి శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి ఎనలేని కృషిచేశారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం సాయంత్రం అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని మంత్రి కారుమూరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి సత్య రాజేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేటి మురళి, ఆడారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధితో పేదల ఆర్థికాభివృద్ధి

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



లక్ష్మీనారాయణపురంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి, ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం అత్తిలి మండలం ఉనికిలి, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని, రానున్న ఎన్నికలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గత టీడీపీ హయాంలో ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ సొమ్మును గాదెకాడ పందెకొక్కుల్లా దోచుకుతిన్నారని, దానిఫలితంగా మాజీ సీఎం చంద్రబాబు ఊసలు లెక్కపెడుతున్నారని దుయ్యబట్టారు. గత పాలనలో పేదలకు ఒక్క సెంటు భూమికూడా ఇచ్చిన దాఖలాలు లేవని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్షలాది మంది అక్కచెల్లెమ్మలకు ఇంటి స్థలాలు అందజేసి, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష వంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు జరిపి, మందులను అందజేశారన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పౌరసేవలు అందిస్తున్న ఈ ప్రభుత్వానికి మీ ఆశీస్సులు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ వట్టికూటి అనంతలక్ష్మి, ఎంపీటీసీ ముదునూరి దుర్గాభవానీ, ఆడారి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు వట్టికూటి సూర్యనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు బొడ్డేటి మురళి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, మండా సత్యనారాయణమూర్తి, బొడ్డు వెంకటేశ్వరరావు, ఆకుల పండుస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం రూరల్: అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి తామంతా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టు విశాల్ అన్నారు. శనివారం మండలంలోని పుల్లాయగూడెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైన పెదముత్తి ముసలయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కొట్టు విశాల్ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సాయం త్వరితగతిన అందించడానికి ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సహకారంతో కృషి చేస్తానన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.15వేలు నగదు, దుస్తులు, బియ్యం, కిరాణా సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, కొమ్ముగూడెం సొసైటీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్ర కుమార్, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకుమారి, వార్డు మెంబర్ అయిన మిల్లి రాఘకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చిన సీఎం జగన్



పింఛన్లు పంపిణీ చేస్తున్న జగజ్జీవన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను తూ.చ తప్పకుండా నెరవేర్చిన ఏకైక నేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, 13వ వార్డు ఇన్‌చార్జి తెన్నేటి జగజ్జీవన్ పేర్కొన్నారు. వార్డులో శనివారం పింఛన్ల పంపిణీ, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా దృష్టిలోపం ఉన్న రోగులకు కళ్లజోళ్లు అందజేశారు. జగజ్జీవన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దశల వారీగా నేడు మూడు వేలు పింఛన్ లబ్ధిదారులకు అందిస్తున్నారని వివరించారు. వితంతు, వృద్ధాప్య, వికలాంగులకు అపన్న హస్తం అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్లు ధర్నాల శేఖర్, ఎర్రంశెట్టి కృష్ణవేణి, హెల్త్ సెక్రటరీ శారదా, వలంటీర్లు లక్ష్మీకుమారి, ధనకుమారి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇరగవరం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ డైరెక్టర్

ఇరగవరం: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఇరగవరం ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి గ్రామం సంక్షేమంతోపాటు అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణలు దాదాపుగా అన్ని గ్రామాల్లో పూర్తయ్యాయని తెలిపారు. మండలంలోని 21 గ్రామాల్లో సుమారు రూ.14 కోట్లతో ఆర్అండ్‌బీ, సీసీ, పంచాయతీ రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇరగవరం మెయిన్ రోడ్, రేలంగి శివారు గవర్లపాలెం నుంచి ఈడూరు వరకు రోడ్ల నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కరెంటు లోవోల్టేజీ సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారని ఇరగవరం ఎంపీటీసీ మంగెన రామానాయుడు ప్రశ్నించగా త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ అధికారలు చెప్పారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని మండల అధికారులు, నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సౌత్ యాగర్లపల్లి సబ్‌స్టేషన్, జట్లపాలెం ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణం, పెంటపాడు మండలం పరిధిలోని కొబ్బరితోట, పడాల గరువు, కడకట్ల కాల్వగట్టు, జట్లపాలెం, యాగర్లపల్లి, ఉమామహేశ్వరం, మౌంజీ పాడు, ముత్యాలంబపురం, ఉప్పాకపాడులలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పింఛన్ల పంపిణీ



22వ వార్డులో పింఛన్లు అందజేస్తున్న వార్డు ఇన్‌చార్జి చిటికన ప్రసాద్

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచిన రూ.3 వేల పింఛన్లను వృద్ధులకు తమ చేతులమీదుగా అందించడం ఆనందంగా ఉందని ఆయా వార్డుల ఇన్‌చార్జిలు సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక 20, 22, 31వ వార్డుల ఇన్‌చార్జిలు వెలనాటి సత్తిబాబు, చిటికన ప్రసాద్, నీలి భూషణం తమ వార్డుల్లోని వృద్ధులకు శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎవరూ ఊహించని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని, అదేవిధంగా నియోజకవర్గ అభివృద్ధికి కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

అంటుకట్టే పద్ధతిపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ ఎం.మాధవి

తాడేపల్లిగూడెం: జీడిమామిడి సాగు చేసే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అలవర్చుకోవాలని వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి చెప్పారు. ఐసీఏఆర్ ఆర్థిక సహకారంతో గిరిజన రైతులకు జీడిమామిడి తోటల పెంపకంలో అంటుకట్టు పద్ధతిపై నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. జీడిమామిడిలో ఎదురయ్యే చీడపీడలు, వాటి నివారణ గురించి శిక్షణలో వివరించారు. ప్రాజెక్టు ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ పాలీబాగ్స్ జీడిమామిడి నారు పెంచే పద్ధతిపై ప్రూనింగ్ విధానం, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. జీడిమామిడి అంటుకట్టే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి టీఎస్‌కే కిరణ్‌పాత్రో వివరించారు. జీడిమామిడి సాగుకు అనుకూలమైన నేలలు, సేంద్రియ ఎరువుల ఉపయోగాన్ని గురించి అసోసియేట్ ప్రొఫెసర్ బి.పెదబాబు వివరించారు. చాందినీరాజ్, రవికిరణ్, పీజీ పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాలి



వేల్పూరులో విజేతలకు టీ షర్టులు, టోపీలను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

తణుకు టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో మండస్థాయిలో విజేతలైన క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయిల్లో రాణించాలని ఎంపీపీ రుద్ర ధనరాజు కోరారు. సచివాలయాల పరిధిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీల ముగింపు కార్యక్రమాన్ని తణుకు రూరల్ మండలం వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో వంటి 5 క్రీడాంశాలల్లో విజేతలైన 140 మంది క్రీడాకారులకు టీ షర్టులు, టోపీలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, వైస్ ఎంపీపీ శేషకుమారి, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ముళ్లపూడి బాబూరావు, ఎంపీడీవో కె కిరణ్‌కుమార్, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ఎంపీటీసీలు శ్యామల, సుజాత, పాఠశాల హెచ్ఎం పంపన ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఎఫ్ ఆధ్వర్యంలో ఫ్రీజర్ బాక్సు వితరణ

పెంటపాడు: ప్రత్తిపాడు ట్రిపుల్ ఎఫ్ కర్మాగారం ఆధ్వర్యంలో శనివారం స్థానిక పంచాయతీకి ఫ్రీజర్ బాక్సును బహుకరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పూర్వాధ్యక్షుడు వీర్ల గోవింద్ మాట్లాడుతూ ప్రత్తిపాడులోని ట్రిపుల్ ఎఫ్ కర్మాగారం ఆధ్వర్యంలో పలు గ్రామాలను దత్తత తీసుకొని సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండు మోగుల బలుసులు, సంస్థ మేనేజర్ జనార్దన్, జి.శ్రీనివాసరెడ్డి (ఏజీఎం), వేమల శ్రీనివాస్, ట్రిపుల్ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు ట్రిపుల్ ఎఫ్ కర్మాగారంలో ప్రధానమంత్రి టీబీ ముక్త యోజన కార్యక్రమంలో భాగంగా 30 మంది టీబీ సోకిన వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు శనివారం పంపిణీ చేశారు. కర్మాగార రామేశ్వర్ బాలకృష్ణ గోయంకా ట్రస్టు ఆధ్వర్యంలో 30 మందికి న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. ఇన్‌చార్జి వేమల శ్రీనివాస్, జనరల్ మేనేజర్ జనార్దన్, సీఎస్ఆర్ సహాయ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవా దృక్పథం



తణుకు టౌన్: రాజమండ్రిలోని ఆసుపత్రిలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ ఉమా సంతోషి



తణుకు టౌన్: మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివసాయి దుర్గ

తణుకు అర్బన్: వలంటీర్లు సేవా దృక్పథం చాటుకుని ప్రజలచేత భేష్ అనిపించుకుంటున్నారు. పట్టణంలోని 30వ వార్డుకు చెందిన మార్నెళ్ల శేషారావు పింఛన్ లబ్ధిదారు. ఆయన అనారోగ్యంతో ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఈనెల అందించాల్సిన పింఛన్ మొత్తాన్ని వలంటీర్ ఉర్ల గీత శనివారం ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి వెళ్లి శేషారావుకు పింఛను అందచేశారు.

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ 2వ సచివాలయం పరిధిలో మద్దంశెట్టి వెంకటలక్ష్మి పింఛన్ లబ్ధిదారు. ఆమె గత 10 రోజులుగా డయాలసిస్ సమస్యతో రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో వలంటీర్ కోలపల్లి ఉమా సంతోషి శనివారం దువ్వ నుంచి రాజమండ్రిలోని ఆసుపత్రికి వెళ్లి వెంకటలక్ష్మికి వితంతు పింఛన్ సొమ్ము రూ.3 వేలు అందజేసంది. అలాగే వేల్పూరు 3వ సచివాలయానికి చెందిన సిద్దాని పెంద్దింట్లమ్మ చేయి విరగడంతో మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. శనివారం వలంటీర్ శివసాయి దుర్గ మంగళగిరి వెళ్లి పెద్దింట్లమ్మకు పింఛన్ అందజేసింది. ఈ సందర్భంగా వలంటీర్లను పలువురు అభినందించారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు



దేవి సొసైటీ వారిచే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మల్లిపూడి మిత్ర

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు చదువులపై శ్రద్ధ వహించాలని ఓడీఐసీ నిర్వాహకులు మల్లిపూడి మిత్ర అన్నారు. దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ మల్లిపూడి కనకదుర్గాదేవి, మిత్ర అవుట్ రీచ్ అండ్ డ్రాప్ ఇన్ సెంటర్ వారి ఆధ్వర్యంలో శనివారం యాగర్లపల్లిలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్ర మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, చెడు వ్యవనాల జోలికి పోవద్దని విద్యార్థులకు హితవు పలికారు. చదువుపై శ్రద్ధ పెట్టి జీవితంలో రాణించాలన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.ధనలక్ష్మి, అంజని దేవి, పి.మోహన్, పీర్ ఎడ్యుకేటర్ వై.హర్షవర్ధన్, ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ పదవికి మెంటరాజు రాజీనామా

ఇరగవరం: వైస్ ఎంపీపీ చీలీ మెంటరాజు (రేలంగి-3 ఎంపీటీసీ) వ్యక్తి గత కారణాలతో తన పదవికి శుక్రవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో ఎ శ్రీనివాస్ తెలిపారు. ఆయన రాజీనామా పత్రాన్ని జిల్లా అధికారులకు పంపిచడం జరుగుతుందన్నారు.